క్లుప్తంగా

నేడు సమావేశం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీతానగరం హైస్కూల్లో సమావేశం నిర్వహిస్తున్నట్టు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మట్టాడి వెంకట రమణ తెలిపారు. మండలంలోని బడుగు, బలహీన వర్గాల నాయకులు, పార్టీలకు అతీతంగా దళిత నాయకులు, విద్యావంతులైన మేధావులు, అన్ని గ్రామాల అంబేడ్కర్ యువత తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామలింగ భాస్కర్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నిర్వహించే గ్రామోత్సవం అనంతరం రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని చెప్పారు.

ముగిసిన సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: ఓటమితో అంతా అయిపోయిందనుకుంటే పొరబాటు అని, దానిని గెలుపునకు తొలిమెట్టుగా భావించాలని గైట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బరాజు అన్నారు. కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరిగిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలకు 34 కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో విన్నర్లు, రన్నర్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, పీడీ డాక్టర్ సీఎం హెన్రీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కేటాయించాలి

సీతానగరం: రాజానగరం నియోజకవర్గం ప్రాతినిథ్యం బీసీలకే కేటాయించాలని టీడీపీ బీసీ నాయకుడు బర్ల బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీతానగరంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సుమారు 40 మంది ముఖ్య నేతలు తుని వెళ్లి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని కలిశామన్నారు. కొత్తగా నియోజకవర్గం ఇన్‌చార్జిని నియమించాలని కోరారని, బీసీ సామాజిక వర్గానికి ప్రాతినిథ్యం ఇవ్వాలన్నారన్నారు. బీసీలందరూ ఒకే తాటిపైకి వస్తే పార్టీ గెలుపు ఖాయమన్నారు.

మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందిస్తున్న సర్పంచ్ మాధవి దంపతులు

రంగంపేట: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని గ్రామ సర్పంచ్ వేము మాధవి, గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వేము చిరంజీవి దంపతులు ఆకాంక్షించారు. శనివారం మర్రిపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులతో వారు సమావేశమయ్యారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష రాసే ప్యాడ్‌లు, పెన్‌లు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మండల సచివాలయ కన్వీనర్ బొద్దు ముత్యాలరావు

బిక్కవోలు: ఏప్రిల్ 7 నుంచి 14వ తేదీ వరకూ జరిగే 'జగనన్నే మా భవిష్యత్' కార్యాక్రమాన్ని విజయవంతం చేద్దామని మండల సచివాలయ కన్వీనర్ బొద్దు ముత్యాలరావు అన్నారు. శనివారం పందలపాకలో వలంటీర్లు, గృహసారథులతో నిర్వహించిన సమావేశంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో అనుసరించాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్, ఎంపీటీసీ మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి సత్యనారాయణ, కర్రి ఇస్రారెడ్డి, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో ముమ్మరంగా వరికోతలు

- యంత్రాలతోనే పనులు
- సమయం, ఖర్చు ఆదా
- ఆశాజనకంగా దిగుబడి



చంద్రేడులో యంత్రం ద్వారా వరికోత

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో రబీ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతులు రెండు రోజుల నుంచే కోతలు ప్రారంభించారు. ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. బోర్లు, చెరువులు, కాలువలు వద్ద సాగుచేసిన వరిపైరును రైతులు ఒబ్బిడి చేసుకుంటున్నారు. మరోపక్క వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు ప్రస్తుత సీజన్‌లో తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉందని రైతులు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీంతో దిగుబడి బాగుందన్నారు.

అనపర్తి నియోజకవర్గ పరిధిలో...

రబీ సీజన్‌కు సంబంధించి అనపర్తి మండలంలో 3,929 హెక్టార్లు, పెదపూడి మండలంలో 7,200 హెక్టార్లు, బిక్కవోలు మండలంలో 6,105 హెక్టార్లు, రంగంపేట మండలంలో 2,008 హెక్టార్లలో వరినాట్లు వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రంగంపేట మండలంలో బోర్లు, చెరువుల కింద మాత్రమే ఈ సీజన్‌లో వరి సాగు చేస్తారు. అందుకే విస్తీర్ణంలో మిగతా మూడు మండలాల కంటే ఇక్కడ తక్కువ ఉంటుంది.

నిరంతర విద్యుత్

విద్యుత్ సరఫరా పగటి పూట నిరంతరంగా ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అనపర్తి, పెదపూడి, బిక్కవోలు మండలాలకు కాలువలు, బోర్లు ఉండటంతో నీటి కొరత లేదు. అయితే ఈ మూడు మండలాల్లో మరో పక్షం రోజుల్లో కోతలు ప్రారంభం కానున్నాయి. రంగంపేట మండలంలో మాత్రం సగం కోతలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

యంత్రాలతో కోత

ఈ సీజన్‌లో అనపర్తి నియోజకవర్గంలో ఎక్కువగా ఎంటీయూ 3626, ఎంటీయూ 1121, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను సాగు చేశారని, వీటి దిగుబడి ఎకరానికి 45 నుంచి 50 కాటాలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కూలీల కొరత, కూలి ధరలు ఎక్కువగా ఉండటంతో ఎక్కువ మంది వరి కోత యంత్రాల ద్వారా పంటను కోయిస్తున్నారు. కూలీల ద్వారా అయితే ఒక ఎకరాకి 8 నుంచి 10 మంది వరకూ కూలీలు అవసరం. మగవారికి



రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం

రూ.500, మహిళలకు రూ. 400 చెల్లించాల్సి వస్తోంది. కోతకోయడం, పన తిరగవేయడం, పనకట్టడం, కుప్పవేయడం, కుప్పనూర్చడం వంటి కార్యక్రమాలు చేయాల్సి ఉంది. కూలీలు, ట్రాక్టరుకు రూ.10 నుంచి రూ.15 వేల వరకూ ఖర్చవుతుందని, పైగా ఈ పనులకు వాతావరణం కూడా అనుకూలించాలి.

ఖర్చు ఆదా

చాలామంది రైతులు యంత్రాలను ఉపయోగించి కోతలు కోయిస్తున్నారు. అనంతరం నేరుగా ధాన్యాన్ని సేకరించి, కళ్లాల్లోనే ఆరబెట్టి బస్తాల్లోకి నింపుతున్నారు. యంత్రాల ద్వారా ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.2500లకు గంటన్నర కాల వ్యవధిలో ధాన్యం చేతికి రావడంతో ఎక్కువశాతం యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం వైఎస్సార్ యంత్రసేవ పథకం ద్వారా రైతు గ్రూపులకు వరికోత మెషీన్లను రాయితీపై అందించింది. ప్రభుత్వం వరి సాధారణ రకానికి క్వింటాలుకు (75 కేజీలు) రూ.1530, ఏ గ్రేడు రకానికి క్వింటాలుకు (75 కేజీలు) రూ.1545 మద్దతు ధర చెల్లిస్తున్నారు. దళారులు మాత్రం రూ.1300కే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

> **పచ్చిరొట్ట సాగుతో పొలాలకు మేలు**
>
> 
>
> ప్రస్తుత సీజన్‌లో వరికోతల అనంతరం పొలాల్లో పచ్చిరొట్ట వేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. వేసవిలో పశువుల ఎరువుకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. రైతుభరోసా కేంద్రాల్లో జీలుగ, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేలను సంప్రదించాలి.
>
> – దీవీ కృష్ణ, ఏడీఏ, అనపర్తి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కొప్పవరం పంచాయతీ వార్షిక ప్రగతి నివేదిక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, దాంట్లో భాగంగానే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మూడోరోజు అనపర్తి గ్రామ సచివాలయం -4 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగనన్నకు తమ ఆశీస్సులు అందించి రుణం తీర్చుకుంటామని పలువురు మహిళలు తెలియజేశారు. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటను కచ్చితంగా నిలబెట్టుకునే నైజం సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంతమన్నారు. సీఎం జగన్ పేదల పక్షపాతి అని, పేదల ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కుల, మతాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు పూర్తి పారదర్శకంగా అమలు జరుగుతున్నాయి కాబట్టే గడప గడపకూ కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో టీడీపీ నాయకుల ఇళ్లకు సైతం ధైర్యంగా వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఎన్ఎస్ఆర్ మురళి, సత్తి వెంకటరామారెడ్డి, ఎంపీటీసీ కర్రి చినవెంకటరెడ్డి, వార్డు సభ్యురాలు నల్లమిల్లి సుజాత, పార్టీ నాయకులు పులగం చిన్నారెడ్డి, నల్లమిల్లి తాతారెడ్డి, సత్తి పోతారెడ్డి, పాలి అంజి తదితరులు పాల్గొన్నారు.

కొప్పవరం.. పారదర్శక పాలనకు ఆదర్శం

అనపర్తి: ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవకుడిగా ముందుకు సాగుతున్న సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి అభినందనీయుడని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం కొప్పవరంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పారదర్శక పాలనకు కొప్పవరం పంచాయతీ పాలకవర్గం మిగిలిన పాలకవర్గాలకు ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ఎమ్మెల్యేగా తనను ఆదరించిన ఈ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని, గ్రామం మరింత అభివృద్ధి సాధించేందుకు తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఎటువంటి అపోహలకు తావులేకుండా ఏటా పంచాయితీ ఆదాయ, వ్యయాలను నివేదిక రూపంలో బహిర్గతం చేయడంతో పాటు కరపత్రాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసే సంప్రదాయానికి సర్పంచ్ శ్రీకారం చుట్టారంటూ అభినందించారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గ్రామంలో గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై నూతనంగా నిర్మించిన మండపాన్ని, విగ్రహం వద్ద సుందరీకరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు తాడి వెంకటరామకృష్ణారెడ్డి, తాడి సూరారెడ్డి, ఎంపీటీసీ పోతంశెట్టి మంజు కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో మహిళలకు సముచిత స్థానం



వైఎస్సార్, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

అనపర్తి: మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామవరంలో ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళ ఆర్థిక సాధికారత కోసం కృషిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక శాతం నిధులు మహిళలకే కేటాయించి మహిళలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, ఏపీఎం జిలాని, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి



కైకవోలులో ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి అన్నారు. కైకవోలు, పెదపూడి గ్రామాల్లో సర్పంచ్‌లు నూని పట్టాభిరామన్న చౌదరి, కె.కృష్ణమూర్తి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో 123 డ్వాక్రా సంఘాలకు కలిపి రూ.2,26,07,051 చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ వుద్రు సత్యనారాయణ, ఉప సర్పంచి కొప్పిశెట్టి వీరశంకర్, ఎంపీటీసీ సభ్యులు సమ్మంగి దుర్గాప్రసాద్, తిమ్మరాజు రాజుబాబు, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మహిళల పక్షపాతి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. శనివారం మండలంలోని బలభద్రపురం ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 1524 మహిళ సంఘాలకు గాను ప్రభుత్వం ఆసరా రూపేణా రూ.14 కోట్లు జమ చేసిందన్నారు. కుల, మత బేధాలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, బలభద్రపురం సర్పంచ్ బుంగా రామారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జి.అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. కాపవరం ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

జ్ఞాన సరస్వతీ విద్యానికేతన్ ప్రారంభం



గోకవరంలో జ్ఞాన సరస్వతీ విద్యానికేతన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక బీఎస్ఆర్ కళాశాల ఎదురుగా జ్ఞాన సరస్వతీ విద్యానికేతన్ ఇంగ్లిషు మీడియం పాఠశాల శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. పాఠశాల కరస్పాండెంట్ బొడ్డేటి సురేష్, కంచర్ల సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన గోకవరంలో సువిశాల ప్రదేశంలో ఇంగ్లిషు మీడియం పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలను స్థాపించిన సూర్యప్రకాష్, సురేష్‌లను ఎమ్మెల్యే అభినందించారు. పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే మంచి లక్ష్యంతో ఈ పాఠశాలను ప్రారంభించామన్నారు. పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి తమ్మన్నదొర, దాసరి చినబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కంచర్ల నరసింహమూర్తి, బత్తుల నానాజీ, నాగులకొండ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకుని స్వామి అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేండ్ర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిపారు.ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారి కల్యాణం ఆదివారం తెల్లవారుజామున నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వద్దాది సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ కోసూరి వాసు, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి: మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బీవీఎల్ నరసింహం తెలిపారు. మండలంలోని అనపర్తి, కుతుకులూరు, కొప్పవరం, పీరారామచంద్రపురం గ్రామాల పరిధిలో మొత్తం 6 పోస్టులు ఖాళీలున్నాయని రిజర్వేషన్ ప్రాతిపదికన వీటిని భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అనపర్తి గ్రామ పరిధిలో ఖాళీగా ఉన్న 3 వలంటీర్ పోస్టులకు గాను బీసీ-పురుష, ఎస్సీ-పురుష, ఎస్సీ-మహిళ, కుతుకులూరు ఎస్సీ-మహిళ, కొప్పవరం బీసీ-పురుష, పీరారామచంద్రపురం ఎస్సీ-పురుషకు రిజర్వు చేశారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

అక్రమ మట్టి తవ్వకాలపై అధికారుల కొరడా

అనపర్తి: స్థానిక ఐఎల్‌టీడీ సాయిబాబా గుడి నుంచి ద్వారపూడి వెళ్లే రహదారిలోని గోదాముల సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. దీనికి సంబంధించి స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ద్వారపూడి రోడ్డులో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.శశిధర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అధికారుల రాకను గమనించిన జేసీబీ, ట్రాక్టర్ డ్రైవర్లు అక్కడ నుంచి జారుకున్నారు. సర్వే నెంబరు 26లో సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతూ ఈ మట్టితో సమీపంలోని పామాయిల్ తోటను మెరక చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఎంత సేపటికి సంబంధిత వ్యక్తులు రాకపోవడంతో రెవెన్యూ అధికారులు జేసీబీ, ట్రాక్టర్ తాళాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తహసీల్దార్ శశిధర్‌ను వివరణ కోరగా అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారులకు సమాచారమిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలో పలు బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. శ్రీరామపురంలో ఏడిద వీరమ్మ, సుంకర వాసు, ఆదిమూలం చిలకమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాతృవియోగంతో బాధపడుతున్న కొండగుంటూరు సర్పంచ్ ఉర్లింకల నాగలక్ష్మిని పరామర్శించారు. సీతానగరం మండలం ఇనుగంటివారిపేటకు చెందిన జెస్సీ కాపు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన వెంట ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఎంపీపీ శ్రీవల్లికి ఎమ్మెల్యే చంటిబాబు పరామర్శ



ఎంపీపీ దంపతులను పరామర్శిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ఎంపీపీ సుంకర శ్రీవల్లిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల ఎంపీపీ తల్లి గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో ఉన్న ఎంపీపీ శ్రీవల్లి, వీరబాబు దంపతులను ఎమ్మెల్యే పరామర్శించి తన సంతాపం తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఐదు పరీక్ష కేంద్రాలు

సీతానగరం: పదో తరగతి పరీక్షలకు మండలంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈవో కె.స్వామినాయక్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలం నుంచి 674 మంది, రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు నుంచి 166 మంది విద్యార్థులకు ఈ కేంద్రాల్లో పరీక్షలు రాస్తారన్నారు. సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, వెదుళ్లపల్లి హైస్కూళ్లతో పాటు సూర్యచంద్ర హైస్కూల్లో కేంద్రాలు ఉన్నాయన్నారు. సెంటర్లలో తాగునీరు, ఎలక్ట్రిసిటీ, ఫర్నిచర్ సదుపాయాలను సిద్ధం చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. సెల్ ఫోన్‌ను పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపించి ఆర్టీసీబస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రంగంపేట: ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 567 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 212 మంది, వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 176 మంది, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 179 మంది పరీక్షలు రాస్తారన్నారు. మూడు కేంద్రాల్లో మొత్తం 32 మంది ఇన్విజిలేటర్లను నియమించామని చెప్పారు.

మండల ప్రథమం సాధిస్తే రూ.50 వేల బహుమతి

సీతానగరం: చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మండలంలో ప్రథమస్థానంలో నిలిస్తే రూ.50 వేలు బహుమతిగా అందిస్తామని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు ప్రకటించారు. ఆయన శనివారం చినకొండేపూడి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్య అనేది సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు, గౌరవాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రూ.77 కోట్ల ఆస్తిపన్ను వసూలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో 2022 –23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నుదారులు రూ.77 కోట్లు చెల్లించారని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఇంటి పన్ను, ఖాళీస్థలాల పన్ను, నీటిచార్జీలపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీమాఫీ ప్రకటించడంతో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. మార్చి 31వ తేదీ లోపు రూ.77.01 కోట్ల చెల్లింపులు జరిపారన్నారు. సంవత్సరం మొత్తం పన్నుల వసూలు రూ.58.76 కోట్లు కాగా, ఈఏడాది అదనంగా రూ.18.25 కోట్లు వసూలు చేయగలిగామన్నారు. ఈ నిధులతో నగరంలో కూడళ్ల, అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామన్నారు. ముందుస్తుగా పన్ను చెల్లించేవారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిఏటా ఏప్రిల్‌లో ఐదుశాతం రిబేటుతో పన్ను చెల్లించుటకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఎటువంటి బకాయిలు లేకుండా ఉన్న పన్నుచెల్లింపుదారులు 2023 – 24 సంవత్సరానికి ఏకమొత్తంగా పన్ను ఒకేసారి చెల్లిస్తే ఐదుశాతం రిబేటు ఇస్తామన్నారు.